

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

అన్ని రంగాల తరహాలోనే పరిశ్రమల్నీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. వైసీపీ నాయకుల తీరుతో జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహికులు ముందుకు రాలేని పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు కొన్నాళ్ల ముందు పుంగనూరులో పెద్దిరెడ్డి మాత్రం 2 వేల ఎకరాల్లో పరిశ్రమలు స్థాపిస్తున్నట్లు హడావిడి చేశారు. అడుగు ముందుకు పడలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే రెండు రాష్ట్రాల సరిహద్దున ఉన్న జిల్లాలో పారిశ్రామిక పార్కుల్ని ఏర్పాటు చేసేలా, ఉన్న పార్కుల్ని అభివృద్ధి చేసేలా ప్రయత్నిస్తోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



జిల్లా పారిశ్రామిక రంగంలో మరకలు, మెరుపులు

తొలి సగం : హడావిడికే పరిమితం

పరిపాలించిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చెప్పుకోదగ్గ ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు చేయలేదు.2023 డిసెంబరులో మాత్రం ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కుల తయారీ కంపెనీని పుంగనూరులో ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి హడావిడి చేశారు. పుంగనూరు మండలం గోపిశెట్టిపల్లెలో స్థలాన్ని కూడా పరిశీలించారు. 2 వేల ఎకరాల్లో మరో 10 కంపెనీలు వస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు 2021 జూలైలో సిలిండర్లు, బ్యాటరీల కంపెనీ పెడుతున్నట్లు మిట్టచింతలపల్లెలో 38 ఎకరాలు సేకరించారు. పైపుల పరిశ్రమ పెడుతున్నట్లు ఆరడిగుంటలో 62 ఎకరాలు సేకరించి శంకుస్థాపన చేశారు.వీటితో పాటు 2022 ఆగస్టులో గాయత్రి సిలిండర్ల ఫ్యాక్టరీ కోసం వేసిన శిలాఫలకం అలాగే ఉంది.

- వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుప్పంలో పెట్టదలుచుకున్న సుమారు రూ.3 వేల కోట్ల పెట్టుబడులు ఆగిపోయాయి. బ్రిటానియా, ఆదిత్య బిర్లా, వైష్ణవి మెగా ఫుడ్స్, పార్క్, తిరుపూరర్ గార్మెంట్స్ వంటి 8 సంస్థలు అప్పటి టీడీపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని తర్వాత ముందుకు రాలేదు.
- గంగవరం మండలంలోని గండ్రాజుపల్లెలో 482 ఎకరాల్లో ఉన్న పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయలేదు.
- విజయపురం మండలంలోని కోసలనగరంలో సేకరించి పెట్టిన 2 వేలకుపైగా ఎకరాలను అభివృద్ధి చేయకపోవడంతో అక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహికులు ముందుకు రాలేదు.
- రేణిగుంట మండలం కరకంబాడి, యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద ఉన్న అమరరాజా బ్యాటరీల సంస్థల్లోని 9 యూనిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో విద్యుత్తు శాఖ సరఫరా నిలిపివేసింది. దీంతో జిల్లాలో రూ.9500 కోట్లతో నెలకొల్పాల్సి ఉన్న లిథియం బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఆ సంస్థ తెలంగాణకు తరలించింది. దీంతో 4500మంది జిల్లా వాసులకు దక్కాల్సిన ఉపాధి అవకాశాలు దూరమయ్యాయి.

మలిసగం: పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఉన్న పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడంతో పాటు మరిన్ని పార్కుల్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. కుప్పం, పలమనేరు- పుంగనూరు, నగరి కేంద్రంగా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ప్రతిపాదించిన విమానాశ్రయానికి సమీపంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు 2500 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఆహార శుద్ధి, టెక్స్‌టైల్స్ వంటి పరిశ్రమల్ని ఏర్పాటుచేసి సుమారు 30 వేల నుంచి 40 వేల మంది స్థానికులకు ఉపాధి కల్పించాలని కృషి చేస్తున్నారు.
- గంగవరం మండలంలోని గండ్రాజుపల్లెలో పారిశ్రామిక పార్కు గతం నుంచీ ఉండగా.. దీనికి అనుసంధానంగా భూములు సేకరించి మరింత అభివృద్ధి చేయనున్నారు.
- విజయపురం మండలం కోసలనగరంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని ఇప్పటికే 2 వేల ఎకరాలకు పైగా సేకరించారు. ఈ విషయంగా నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆ మధ్య సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు.1500 ఎకరాలకు పైగా అభివృద్ధి చేసి మౌలిక వసతుల్ని కల్పించాలని భావిస్తున్నారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పీఎంఈజీపీ కింద జిల్లాలో 71 యూనిట్లకు (పాలకేంద్రాలు, ఇటుకల బట్టీలు, హోటల్స్ వంటివి) రూ.2.01 కోట్ల సబ్సిడీతో రుణాలు ఇవ్వమని టార్గెట్ ఇచ్చింది. కానీ జిల్లాలో 101 యూనిట్లకు రూ.4.04 కోట్ల సబ్సిడీ కోసం ఎంపిక చేసి 35శాతం సబ్సిడీతో రుణాలిస్తున్నారు.
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్ని మెరుగుపరిచేందుకు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమ్‌ను ప్రకటించగా.. జిల్లాలో అలాంటి చిన్న పరిశ్రమల్ని గుర్తించే సర్వే జరుగుతోంది. ఇందులో వివరాలను నమోదు చేసుకున్నవారికి ఎలాంటి పూచీకత్తు లేకుండా 25శాతం రాయితీతో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందించనున్నారు.




చిత్తూరులో అరుదైన సుత్తితల పురుగు

మనదేశంలో అరుదుగా కనిపించే సుత్తితల పురుగు శుక్రవారం చిత్తూరు ఎన్టీయార్ జలాశయం పంపుహౌస్ వద్ద కనిపించింది. తల సుత్తిలా ఉండడంతో దీనికి ఈ పేరు వచ్చింది. చూడడానికి రెండు ఇంచీల పొడవు మాత్రమే ఉండే ఇది విషపూరితమైంది. అయితే ఇది కాటు వేయదు. దీని లాలాజలం మన నోటిలోకి వెళ్తే మాత్రం ప్రమాదం. విస్తృతంగా వానలు కురిసినపుడు మాత్రమే ఇది కనిపిస్తుంది.వానపాములు, ఇతర చిన్న కీటకాలను ఆహారంగా తీసుకుంటుంది.

- చిత్తూరు,ఆంధ్రజ్యోతి

జనవరి 1న కాణిపాకంలో సామాన్య భక్తులకే పెద్దపీట

- 31న రాత్రి 12 గంటలకు మూల విరాట్‌కు అభిషేకం
- వేకువజామున 3గంటలనుంచి సర్వదర్శనం ప్రారంభం


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సందర్భంగా జనవరి ఒకటో తేదీన కాణిపాక క్షేత్రానికి విచ్చేసే సామాన్య భక్తులకు పెద్దపీట వేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. వారు మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన రాత్రి 12 గంటలకు మూల విరాట్‌కు అభిషేకం, చందనాలంకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి ఒకటో తేదీన వేకువ జామున మూడు గంటల నుంచే సర్వదర్శనం ప్రారంభించనున్నట్లు చెప్పారు. సుమారు 70వేల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేశామన్నారు. ప్రతి భక్తుడికీ దర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన క్యూలైన్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కువ మంది భక్తులు సొంత వాహనాల్లో వచ్చే అవకాశం ఉందని.. పార్కింగ్, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. వీఐపీల కారణంగా సామాన్య భక్తులు ఇబ్బంది పడకూడదన్నారు. ఆలయ ఉభయదారులకు ఓ సమయాన్ని కేటాయించడానికి వారితో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. రద్దీకి అనుగుణంగా లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే చికిత్స కోసం అంబులెన్స్ సిద్ధం చేస్తామన్నారు. ఉభయదారులు, స్థానికులు, భక్తులు సహకరించాలని కోరారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఈఈ వెంటకనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనంజయ, తహసీల్దార్ మహేష్‌కుమార్, సీఐ శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరు మండలం కండ్రిగ దళితవాడ సమీపంలో తారురోడ్డుపై వర్షపునీటి ప్రవాహం

జిల్లావ్యాప్తంగా వాన

- నగరిలో 64.8 మి.మీ అత్యధిక వర్షపాతం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం పూర్తిగా బలపడింది. దీనిపై ఆవరించిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండడంతో గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా గుడుపల్లె మండలం మినహా మిగిలిన 31 మండలాల్లో జడివాన కురిసింది.అత్యధికంగా నగరిలో 64.8 మి.మీ, అత్యల్పంగా శాంతిపురంలో 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. శ్రీరంగరాజపురంలో 58.6, పూతలపట్టులో 53.8, సదుంలో 50.4, విజయపురంలో 48.6, పెనుమూరులో 46, ఐరాలలో 39.2, నింద్రలో 36.2, పాలసముద్రంలో 33.2, కార్వేటినగరంలో 31.4, గంగాధరనెల్లూరులో 28.2, సోమలలో 26.4, పులిచెర్లలో 26, చిత్తూరు రూరల్‌లో 25, తవణంపల్లెలో 24.6, చిత్తూరులో 23.2, చౌడేపల్లెలో 20.4, వెదురుకుప్పంలో 17.2, పెద్దపంజాణిలో 16.2, పుంగనూరులో 14.8, గుడిపాలలో 12, యాదమరిలో 11.6, బంగారుపాళ్యంలో 11, గంగవరంలో 10.4, వి.కోటలో9.4, పలమనేరులో 9, బైరెడ్డిపల్లెలో 8.2, రామకుప్పంలో 6.8, రొంపిచెర్లలో 5.2, కుప్పంలో 3 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

30నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రాథమిక రాత పరీక్షలో ఎంపికైన వారికి దేహదారుఢ్య పరీక్షలు ఈనెల 30 నుంచి వచ్చే నెల పదో తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. శుక్రవారం రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే అధికారులతో పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్షించారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఉద్యోగం పొందాలనే ఒత్తిడిలో అభ్యర్థులు ఉంటారని, వారితో మర్యాదగా, సహనంతో వ్యవహరించాలన్నారు. అభ్యర్థులు తమతోపాటు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఓ సెట్ జిరాక్స్‌కాపీలను తేవాలని చెప్పారు. కాల్ లెటర్‌లో తెలిపిన స్కోర్‌కార్డు, స్టేజ్-1 అప్లికేషన్, స్టేజ్-2 అప్లికేషన్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కాల్ లెటర్‌లో తెలిపిన తేదీల్లో ఉదయం ఐదు గంటల సమయానికి హాజరు కావాలని స్పష్టం చేశారు. అభ్యర్థికి మాత్రమే మైదానంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు:ఎస్పీ


పోలీసు కానిస్టేబుల్ భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ తెలిపారు. ఎవరైనా ఉద్యోగం తీసిస్తామని చెబితే అలాంటి వారిపై 112 లేదా పోలీసు వాట్సాప్ 94409 00005 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇది మీ బాదుడే కదా జగన్..!

గత ఐదేళ్లలో తొమ్మిది సార్లు కరెంటు బిల్లుల షాక్

అదనపు ఛార్జీల వడ్డనతో జనానికి వైసీపీ చుక్కలు

విద్యుత్ ఛార్జీల పెంపు పై వైసీపీ నిరసన చేయడమా..?



.. ఇదీ జనం, కూటమి నేతల ప్రశ్న. అధికారంలో ఉన్న ఐదేళ్లూ పెంచిన కరెంటు భారాన్ని గుర్తుచేస్తున్నారు. యూనిట్ రూ.5కు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8నుంచి రూ.14 వరకు కొనుగోలు చేసి ప్రజలపై జగన్ మోయలేని భారమేశారని మండిపడుతున్నారు. గత ఐదేళ్లూ కరెంటు బిల్లులు ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ఉన్నాయని వినియోగదారులను గగ్గోలు పెట్టించారు. తొమ్మిదిసార్లు ధరలు పెంచుకుంటూ పోయి సామాన్య, మధ్యతరగతి ప్రజలు కరెంట్ స్విచ్ వేయాలంటేనే భయపడిపోయే పరిస్థితికి తీసుకొచ్చారు. ఇంధన సర్దుబాటు చార్జీల భారం నుంచి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు గత వైసీపీ పాలకులు చుక్కలు చూపించారు.

అందుకే ఎన్నికల ఫలితాలతో వినియోగదారులు తిరిగి వాళ్లకు షాక్ ఇచ్చారు. గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్తుకు ట్రూ అప్ చార్జీ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసింది. సర్దుబాటు రుసుం, సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు.. ఇలా పేరు ఏదైనా వినియోగదారుల పైనే ఆ భారం పడింది. విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను పూడ్చుకునేందుకు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను అడ్డగోలుగా బాదేసింది. ఎప్పుడో, ఎవరో వాడిన బిల్లులకు ట్రూ అప్ చార్జీల పేరుతో వసూలు చేస్తోందని వినియోగదారులు మండిపడ్డారు. ఇవికాకుండా బిల్లు వచ్చిన 14 రోజుల్లోపు చెల్లింపులు జరగకపోతే సర్‌ఛార్జ్, ఇంధన ఛార్జ్, జరిమానా రూపంలో పిండేశారు. ఒక విద్యుత్ సర్వీస్‌కు రూ.100 బిల్లు వస్తే, గడువు తీరిన వారంలోపు చెల్లించకపోతే రూ.135, వారంలోపు కూడా చెల్లించకపోతే మరో రూ.50.. ఆలస్య రుసుంతో రూ.185 చెల్లించాల్సి వచ్చింది. అంటే రూ.100 బిల్లుకు ఆలస్యం కారణంగా అదనంగా రూ85లు కట్టాల్సివచ్చింది.

ఇదీ వైసీపీ బాదుడు : ఎస్పీడీసీఎల్ పరిధిలోని చిత్తూరు, కడప, నెల్లూరు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో పెంచిన ట్రూ అప్ చార్జీలు మొత్తం రూ.6414 కోట్లు ఉండగా, వార్షిక ఆదాయ సర్దుబాటు చార్జీల రూపంలో రూ.878 కోట్లు వినియోగదారులపై భారం వేశారు.

సంవత్సరం	ట్రూఅప్ ఛార్జీలు	సర్దుబాటు ఛార్జీలు
2021-22	రూ.1392 కోట్లు	రూ.591.45 కోట్లు
2022-23	2398 కోట్లు	60.84 కోట్లు
2023-24	2624 కోట్లు	224.93 కోట్లు
మొత్తం	రూ.6414కోట్లు	రూ.876.93 కోట్లు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అప్పుడు ఛార్జీలు పెంచి ఇప్పుడు హడావిడా?


పుంగనూరు ర్యాలీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు

చిత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):అధికారంలో ఉన్నప్పుడు తొమ్మిదిసార్లు కరెంటు ఛార్జీలను పెంచి జనాన్ని బాదేసిన వైసీపీ ప్రతిపక్షంలోకి వచ్చేసరికి నిరసనలకు దిగింది.ప్రతిపక్షాలు, ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఎదురైనా అప్పట్లో పట్టించుకోని వైసీపీ నేతలు శుక్రవారం విద్యుత్ కార్యాలయాల వద్ద కరెంటు ఛార్జీలు తగ్గించాలంటూ ధర్నాలు చేశారు. జగన్ హయాంలోనే ఎడాపెడా విద్యుత్తు కొనుగోళ్లు చేయడంతో ఆ భారం ఇప్పుడూ మోయక తప్పడం లేదు. నవంబరు నుంచి 15 నెలల పాటు కరెంటు ఛార్జీలు పెరగనున్నాయి.నిజానికి జగన్ అప్పట్లో చేసిన పాపం ఇప్పుడు ప్రజలకు శాపంగా మారింది.కాబట్టే వైసీపీ నాయకుల నిరసనలకు ప్రజా మద్దతు పెద్దగా లభించలేదు. అన్నిచోట్లా ఆ పార్టీ నాయకులు నిరసనల్లో పాల్గొని, విద్యుత్తు అధికారులకు అర్జీలు ఇచ్చారు.పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. పలమనేరులో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో.. కార్వేటినగరంలో వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో.. జిల్లా కేంద్రం చిత్తూరులో విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. ఎ.రంగంపేట క్రాస్ నుంచి పూతలపట్టు సబ్‌స్టేషన్ వరకు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కుప్పంలో జరిగిన ర్యాలీలో కూడా ఆ పార్టీ నాయకులు తప్ప ప్రజలు కనిపించలేదు. పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు.

ఇంకా డిప్యూటీ సీఎం 'స్వామి'యే!

అధికార మత్తు వీడని వైసీపీ

వెదురుకుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి ఆరు నెలలు గడిచిపోయాయి. ఇంకా అధికార మత్తు వీడని నేతలు నినాదాల సమయంలో ఉత్సాహం ప్రదర్శించారు.విద్యుత్ ఛార్జీలపై వైసీపీ పోరుబాటలో భాగంగా కార్వేటినగరంలో ర్యాలీ జరిగింది.ఏడీఏ చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చాక కార్యాలయం ముందు వైసీపీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి మాట్లాడారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు 'డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నగారి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి ఆరు నెలలైనా మత్తు వీడని పార్టీ శ్రేణుల నినాదాలు విన్నవాళ్లు నవ్వుకున్నారు.

బీఎల్వోలకు గౌరవ వేతనం రూ.2.26 కోట్ల విడుదల

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా రూపకల్పనలో బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వోలు) కీలకం.ఏడాది పొడవునా విధులు నిర్వహిస్తుంటారు.సెలవురోజుల్లోనూ పనిచేస్తుంటారు. అందుకుగాను గౌరవ వేతనంగా త్రైమాసికానికి రూ.750 (ప్రస్తుతం రూ.1500గా పెంపు) అందిస్తుంది. వీరికి మూడేళ్లుగా గౌరవవేతనం అందలేదు. తాజాగా వీరికి గౌరవవేతనం విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పాత బకాయిలు కలిపి ఒక్కొక్కరికీ రూ.12,750 అందనుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 1776 మంది విధులు నిర్వహిస్తున్నారు. బీఎల్వోలుగా విధులు నిర్వహిస్తున్న వారిలో అత్యధికులు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే. మూడేళ్లుగా గౌరవవేతనం అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. 1776మంది బీఎల్వోలకోసం గౌరవవేతనం రూపంలో రూ.2.26 కోట్లు విడుదలయ్యింది.

31 వరకు ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై ఈనెల 31వ తేదీవరకు సోషల్ ఆడిట్ నిర్వహించి, అభ్యంతరాలను స్వీకరిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన వివరాలను సచివాలయాల్లో ప్రదర్శించామన్నారు. తుది వివరాలను వచ్చే నెల 10వ తేదీన ప్రదర్శిస్తామన్నారు. మూడు దశల్లో తనిఖీలుంటాయన్నారు. పేరు, ఆధార్ నెంబరు, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. అభ్యంతరాలను వీఆర్వోలు పరిశీలించి ఆర్ఐకి, వారు మరోసారి పరిశీలించాక తహసీల్దార్‌కు నివేదిస్తారన్నారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు 50 మందిని ర్యాండమ్‌గా తనిఖీలు చేస్తారన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (APEWIDC)
కలెక్టరు వారి కార్యాలయపు ప్రాంగణము, చిత్తూరు.
A.P ఇ.ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.02-06/AE/2024-25 Dated : 27.12.2024
చిత్తూరు జిల్లా నందు పై తెలిపిన నిట్ నెంబర్ల ద్వారా మొత్తము 05 పనులకు. Dr.B.R అంబేద్కర్ గురుకుల పాఠశాలల యందు రూ.5.00 లక్షల నుండి రూ.15.00 లక్షల విలువ గల మరమ్మత్తులు చేయు పనులకు రిజిష్టర్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి A.P ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నందు టెండర్లు కోరడమైనది.
టెండర్లు ఆరంభపు తేది : 30.12.2024 మ॥ 3.00 గం.
టెండర్లు ముగింపు తేది : 06.01.2025 మ॥ 3.30 గం.
తదుపరి వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, చిత్తూరు వారి కార్యాలయపు పనివేళలో వచ్చి తెలుసుకొన వచ్చును. (9704701530)
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, APEWIDC, Chittoor

ఆ వీఆర్వో మా కొద్దు!

తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్తేరిమిట్టవాసుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత రైతులు

వరదయ్యపాళెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రికార్డులు తారుమారు చేస్తున్న వీఆర్వో తమకు వద్దంటూ మత్తేరిమిట్ట దళిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని చిలమత్తూరు పంచాయతీ మత్తేరిమిట్టలోని సర్వే నెం.35లో సుమారు 60ఎకరాల భూమిని 1960 నుంచి తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. రైతు శ్రీనివాసమూర్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంత భూమిని విక్రయించారన్నారు. ఈక్రమంలో శ్రీనివాసమూర్తి కుటుంబీకుల్లో ఒకరైన ప్రియ చిలమత్తూరు పంచాయతీ సమీపంలో పరిశ్రమలు నెలకొల్పిందన్నారు. ఆమెకు ఎవరో ఆశ చూపి దళిత నిరుపేదలైన తమ పేరుపై ఉన్న భూములను వీఆర్వో రమణయ్య తారుమారు చేశాడని ఆరోపించారు. 2020-24 మధ్య ఇక్కడ పనిచేశారని, సాధారణ బదిలీల్లో వేరే పంచాయతీకి మార్చారన్నారు. కానీ మళ్లీ ఇదే మండలానికి బదిలీ చేయించుకున్నాడన్నారు. అనంతరం తమ సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దారు రాజశేఖర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాజశేఖర్ మాట్లాడుతూ... భూముల పత్రాలను అందిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌నాయుడు, భాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాయుడునాయుడు, మహేంద్ర, నందకిషోర్, ప్రభాకర్, మనోహర, శేఖర్‌నాయుడు, రామకృష్ణ, స్వామిదాస్, వెంకటేష్, రాజగోపాల్‌నాయుడు, విశ్వనాథ్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొనానరు.

దర్శనానికి 18 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,564
తలనీలాలు సమర్పించినవారు: 24,905

కళతప్పిన నాదనీరాజనం







తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీనివాసుడు నాదప్రియుడు. ఆలయం ముందు నాట్య, గానాలతో కళాకారులు తిరుమలేశుని నివేదించుకునే అరుదైన కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. దానికి 'నాదనీరాజనం' అనే పేరు పెట్టారు. భారతరత్నలు, పద్మభూషణులు, పద్మశ్రీలు ఎందరో ఈ వేదికమీద నుంచి కళార్చన చేశారు. టీటీడీ కూడా ఈ కళాకారులను సముచితంగా సత్కరించి స్వామి దర్శనం చేయించి గౌరవించుకునేది. జగన్ జమానాలో కళపై కత్తికట్టారు. 'నాదనీరాజనం' కార్యాక్రమాన్ని భ్రష్టుపట్టించారు. కళాకారులకు కనీసం దర్శనాలు కూడా లేకుండా చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అయినా 'నాదనీరాజనం' లోపాలను సరిదిద్ది పూర్వ వైభవం తీసుకురావాలని కళాభిమానులు కోరుకుంటున్నారు.

- జగన్ జమానాలో నీరుగార్చేశారు
- కళాకారులకు కరువైన గౌరవం
- ముఖం చాటేస్తున్న ప్రసిద్ధులు
- కళాకారుల ఎంపిక తీరుపై ఆరోపణలు
- పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని కొత్త పాలకమండలికి కళాభిమానుల వేడుకోలు

గతమెంతో ఘనం

2009 ఆగష్టు 15న తిరుమల ఆలయం ఎదురుగా ఉండే వేదికపై 'నాదనీరాజనం' ప్రదర్శనలు మొదలయ్యాయి. ఈ వేదికను ఒక దాత నిర్మించారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు 'నాదనీరాజనం'లో జరిగేవి. శాస్త్రీయ నృత్య, సంగీతాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. భారతరత్న లత మంగేష్కర్ (గాత్రం), పద్మవిభూషణ్ లు హరిప్రసాద్ చౌరస్యా (వేణువు), పండిట్ శివకుమార్ (సితార్), మంగళంపల్లి బాలమురళికృష్ణ (గాత్రం), శివరామన్ (మదంగం), పద్మశ్రీలు రంజన గోహార్ (ఒడిస్సీ), శోభానాయుడు (భరతనాట్యం), మీనాక్షి (కూచిపూడి), విఠల్‌దాస్ (నామసంకీర్తనం), కుమారి కన్యకుమారి (వయొలిన్), ఎల్లా వెంకటేశ్వర్లు (మృదంగం) వంటి ఎందరో ప్రసిద్ధులు ఈ వేదికపై ప్రదర్శనలు ఇచ్చారు. నిజానికి 'నాదనీరాజనం' వేదికపై ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు దేశ,విదేశాల్లో ఉన్న డిమాండు సామాన్యమైనది కాదు. లక్షలకు లక్షలు చెల్లించినా కార్యక్రమానికి వారు అంగీకరించడం అంత సులువు కాదు. సాక్షాత్తూ తిరుమల స్వామి సమక్షంలో తాము పాడుతున్నామనీ, నృత్యం చేస్తున్నామనే భావనే వీరిని తిరుమలకు రప్పించేది.

ఇలా ఉండేది..

సుదూర ప్రాంతాల నుంచి ప్రదర్శన ఇచ్చేందుకు తిరుమలకు వచ్చే కళాకారులకు గతంలో ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేవారు. ఏ టాప్‌కు రూ.35 వేలు, ఏ గ్రేడ్‌కు రూ.30 వేలు, నత్యంకు రూ.60 వేలు, నామసంకీర్తనంకు రూ.20 వేలు అందజేసేవారు. అలాగే కళాకారులందరికీ ఉచిత రవాణా, బస కల్పించేవారు. ప్రత్యేక దర్శనం ఉండేది. ప్రదర్శన అనంతరం వేదిక మీదే వీరిని సత్కరించి లడ్డూ ప్రసాదాలు అందజేసేవారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ఈవో, జేఈవోలు సైతం హాజరయ్యేవారు. కళాకారులు కూడా ఎంతో సంతృప్తి చెందేవారు.

ఇలా దిగజారింది..

జగన్ జమానాలో కళాప్రదర్శనలకు విలువ లేకుండా పోయింది. కళాకారులను గౌరవించడం తగ్గిపోయింది. టీటీడీకి ఆర్థికభారం అంటూ అన్నీ రద్దు చేసేశారు. 'నాదనీరాజనం'లో ప్రదర్శన ఇవ్వాలనుకున్నవారు సొంత ఖర్చుతోనే తిరుమలకు రావాలని ఆదేశించారు. కళాకారులకు ఉచిత వసతి లేదన్నారు. చివరికి స్వామి దర్శనాలు కూడా కుదరదని చెప్పేశారు. కార్యక్రమం సమయాన్ని కూడా మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. 2020 నుంచి ఏడాది పాటు ఈ విధానం కొనసాగింది. దీంతో చాలా మంది ప్రముఖ కళాకారులు రావడానికి ఇష్టపడలేదు. ఒకప్పుడు కర్ణాటక, హిందుస్థానీ సంగీత కచేరీలకూ, నామసంకీర్తనం కళాకారులకూ వేదిక అయిన 'నాదనీరాజనం' ఇప్పుడు వెలవెల పోతోంది. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఆంధ్రనాట్యం, మోహినియాట్టం, మణిపురి, ఒడిస్సి శాస్త్రీయ నత్యాలను ఈ వేదిక మీద నుంచి వీక్షించిన ప్రేక్షకులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. వయొలిన్, మృదంగం, ఘటం, డోలు, వేణువు, కంజీర, మోర్సింగ్, నాదస్వరం, వీణ, శాస్సోఫోన్, తవిల్, సితార్, సరోద్ వంటి వాయిద్య విన్యాసాలను తన్మయులై వీక్షించిన వారు.. ప్రస్తుత ప్రదర్శనల తీరు చూసి పెదవి విరుస్తున్నారు.

కళావిలువలకు తిలోదకాలు

'నాదనీరాజనం' ప్రదర్శనలకు గతంలో ఒక ఎంపిక కమిటీ ఉండేది. టీటీడీ మాజీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ నేతృత్వంలో.. కుమారి కన్యాకుమారి, శోభారాజ్, మల్లాది సూరిబాబు, గంగాదేవి, నేదునూరి కృష్ణమూర్తి వంటి దాదాపు 35 మంది సంగీత ప్రముఖులు ఈ కమిటీలో ఉండేవారు. వీరు కళాప్రదర్శనలు ఎంపిక చేసి ఏ రోజున ప్రదర్శన ఇవ్వాలో నిర్ణయించేవారు. 2017లో పీవీఆర్కే ప్రసాద్ మరణం తర్వాత నిపుణుల కమిటీ లేకుండా పోయింది. అయితే 2022 ఫిబ్రవరిలో సంగీత కళాశాల, వేదిక్ యూనివర్సిటీ, ఎస్వీబీసీ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కళాకారుల ఎంపిక తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేడ్‌తో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం కళాప్రదర్శనలకు అనుమతులు ఇచ్చేశారు. కళాకారుల పట్ల టీటీడీ తీరుపై అసంతృప్తి చెందిన ప్రసిద్ధులైన కళాకారులు 'నాదనీరాజనం'పై ఆసక్తి చూపలేదు. దీంతో కళాకారులకు పారితోషకాన్ని రద్దు చేసి, ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు మాత్రమే దర్శనం, వసతిని కల్పించారు. ఉచితంగా ప్రదర్శనలిచ్చేందుకు ఔత్సాహికులైన కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చునంటూ అప్పట్లో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రకటనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చైర్మన్‌గారూ పట్టించుకోండి

శ్రీకృష్ణదేవరాయలు వంటి కళాపోషకులకు ఆరాధ్య దైవం అయిన తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న కళారహిత చర్యలను సరిదిద్దాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కళాభిమానులు డా. టి.శ్రీనివాసరావు, డా. కె.జగ్గారావు టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడును అభ్యర్థిస్తూ ఒక లేఖ రాశారు. ఒకప్పటి పారితోషకాల విధానాన్నీ, గౌరవాలను తిరిగి ప్రవేశపెట్టి నాదనీరాజనంకు పూర్వపు వైభవాన్ని పునరుద్ధరించాలని కోరారు.

క్రైం కార్నర్

విద్యార్థిని పట్ల అసభ్యకర ప్రవర్తన

- ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అరెస్ట్



ఉమా మహేష్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ప్రొఫెసర్ ఉమామహేష్ శుక్రవారం అరెస్టయ్యారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. వ్యవసాయ కళాశాలలో క్రాప్ ఫిజియోలజీ విభాగంలో ఉమామహేష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన ఓ విద్యార్థిని ఫీజులు సక్రమంగా చెల్లించి తరగతులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఆమె ఒక్కరే క్లాస్‌కు రావడంతో నవంబరు నెలలో పాఠం చెబుతూ.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బయటకు చెప్పేందుకు మధనపడిన ఆమె.. చివరకు ఇప్పుడు తన తల్లిదండ్రులకు చెప్పారు. వారు శుక్రవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ప్రొఫెసర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

మహిళ వద్ద రూ.2.80 లక్షల అపహరణ



బాధితురాలు పల్లెమ్మ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి తీసుకెళ్తున్న రూ.2.80 లక్షలు అపహరణకు గురైన ఘటన నాయుడుపేట పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలు... మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో నివాసం ఉంటున్న పల్లెమ్మ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తోంది. వ్యవసాయ పనులకు డబ్బులు అవసరం కావడంతో శుక్రవారం బ్యాంకుకు వెళ్లి నగలు తాకట్టుపెటి రూ.2.83 లక్షలు తీసుకుంది. ఇందులో రూ.3వేలు ఖర్చుల కోసం పర్సులో పెట్టుకుంది. మిగతా నగదును కర్రల సంచిలో భద్రపరుచుకుని బ్యాంక్ నుంచి బయలుదేరింది. బజారులో కిరాణా దుకాణం వద్ద ఆగి వస్తువులను కొనుగోలు చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రూ.2.80 లక్షలు అపహరించారు. కొంతసేపటి తరువాత సంచిలో నగదు లేకపోవడాన్ని గుర్తించి లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

వైసీపీ నేత బుల్లెట్ జయశ్యామ్ అరెస్టు

- చీటింగ్ కేసులో 14రోజులు రిమాండ్

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చీటింగ్ కేసులో ఆయనకు 14రోజుల రిమాండ్ విధించారు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద కొందరు వైసీపీ నాయకులు పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న పనస కాలువ భూమిని గత ప్రభుత్వ హయాంలో కబ్జా చేశారు. ఆ స్థలాలను వాటాలుగా వేసుకుని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో బుల్లెట్ జయశ్యామ్ తొట్టంబేడు మండలం శివనాథపురం రెవెన్యూ పరిధిలోని పనసకాల్వ భూమిని ఆక్రమించినట్లు బాహాటంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ యేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పనసకాలువ భూమిలో అక్రమంగా నిర్మించిన 105 కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇందులో కేవీబీపురం మండలం రాజులకండ్రిగకు చెందిన కేశవులు అనే వ్యక్తి బుల్లెట్ జయశ్యామ్‌కు రూ.6లక్షలు నగదు చెల్లించి స్థలం కొనుగోలు చేశాడు. ఆరు నెలల క్రితం అది కాలువ భూమిగా తేలడంతో అధికారులు అక్కడ కట్టడాలను కూల్చివేశారు. దాంతో బాధితుడు కేశవులు తన నగదు రూ.6లక్షలు తిరిగి ఇవ్వాలని జయశ్యామ్‌పై ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం బాధితుడు కేశవులు తనకు కాలువ స్థలాన్ని అమ్మి బుల్లెట్ జయశ్యామ్ అనే వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని గట్టిగా నిలదీస్తే రూ.లక్ష నగదు ఇచ్చాడని... ఆ తరువాత నెలలు గడుస్తున్నా మిగతా నగదుపై సమాధానం చెప్పడం లేదని తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై చీటింగ్‌కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఈ కేసులో తొట్టంబేడు పోలీసులు బుల్లెట్ జయశ్యామ్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టుకు హాజరుపరచడంతో 14రోజుల రిమాండ్ విధించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బుల్లెట్ జయశ్యామ్ తీరుపై పెద్దఎత్తున అభియోగాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఆయన బహిరంగంగా దౌర్జన్యాలకు పాల్పడటం దుమారం రేపింది. రెండేళ్ల క్రితం పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ కూడలిలో పాలసరఫరా సంఘం ఎన్నికల నామినేషన్ రోజున టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు కారుపై కాసిరాళ్లతో దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ప్రజలందరూ చూస్తుండగానే చలపతినాయుడును కారు నుంచి బయటకులాగి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఇక పాలకమండలి సభ్యుడుగా ముక్కంటి ఆలయంలో పలువురు అధికారులపై బూతులతో రెచ్చిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

మినీ ట్రక్కును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, ఎనిమిది మందికి గాయాలు
- గొర్రెల సంతకు వెళుతుండగా ప్రమాదం
- క్షతగాత్రులందరూ రైల్వేకోడూరువాసులే



మృతి చెందిన సోమయ్య - దెబ్బతిన్న మినీట్రక్కు

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల సంతకు వెళ్తున్న మినీ ట్రక్కును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన గూడూరు మండలం చెన్నూరు సమీపంలో శుక్రవారం వేకువజామున 3గంటలకు జరిగింది. గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు... అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరువాసులు చిల్లకూరు మండలం ముత్యాలపాడు సమీపంలోని గొర్రెల సంతకు మినీట్రక్కులో శుక్రవారం రాత్రి బయలుదేరారు.వేకువజామున 3గంటల సమయంలో గూడూరు మండలం చెన్నూరు సమీపంలో గూడూరు వైపు నుంచి తిప్పవరప్పాడు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మినీట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న అన్నమయ్య జిల్లా పిట్లావారిపల్లెకు చెందిన సోమయ్య(45) మృతిచెందాడు. నాగవరం గ్రామానికి చెందిన మణి, సుబ్రహ్మణ్యం, ఓబులపల్లెకు చెందిన చిన్నవెంకటయ్య, పాతబజారుకు చెందిన రమణయ్య, తిన్నిశెట్టిపల్లెకు చెందిన పెంచలయ్య, చిన్నరాసపల్లెకు చెందిన ఈశ్వరయ్య, పైనపల్లి గ్రామానికి చెందిన భాస్కర్, రైల్వే కోడూరుకు చెందిన సూర్యప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. సోమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. లారీ వేగంగా ఢీకొనడంతో మినీట్రక్కు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కొంతమంది క్షతగాత్రులు వాహనంలో ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో గాయపడిన వారిని వెలుపలికి తీశారు.

ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 80 గ్రాముల బంగారం, కారు స్వాధీనం

సత్యవేడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సత్యవేడు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం ఉదయం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఊత్తుకోట నుంచి వస్తున్న కారు పోలీసులను చూసి దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమై కారును చుట్టుముట్టామన్నారు. కారులో ఉన్న ఐదుగరిని అదుపులోకి తీసకున్నామన్నారు. అనంతరం కారును తనిఖీ చేయగా 80 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని విచారించగా మండలంతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతన్నట్లు తేలిందన్నారు. ఈ ముఠా సత్యవేడు మండలం శిరుణంబూదూరులో ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ రాత్రి ఓ ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో ఉన్న 40 గ్రాముల బంగారు చోరీ చేసిందన్నారు. అదే విధంగా దాసుకుప్పంలో ఈ ఏడాది మార్చి 20వ తేదీ మధ్యాహ్నం ఓ ఇంట్లో 40 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించారని తెలిపారు. అదే విధంగా తమిళనాడు రాష్ట్రం ఈరోడ్, రాణిపేట జిల్లాల్లో కూడా ఇటీవల తాజాగా చోరీలకు పాల్పడి కారుతో పాటు బంగారు నగలను అపహరించినట్లు తేలిందన్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా సావుకుప్పానికి చెందిన వి.కన్నదాసన్(28), తిరువణ్ణామలై జిల్లా వెంగిక్కల్‌కు చెందిన జీ.శ్రీరామ్ అలియాస్ బిల్లు (19), రంజిత్‌కుమార్ (19), కాంచీపురం జిల్లా మధురమంగళానికి చెందిన డి.రవి(27), విల్లుపురం జిల్లా సెంజివట్టానికి చెందిన బాలుడు ఉన్నారు. వీరు తమిళనాడులో వివిధ కేసుల్లో జైలుశిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తెలిసింది.



అంతర్రాష్ట్ర ముఠా అరెస్టను చూపుతున్న పోలీసులు



మత్స్యకార నాయకులతో సమావేశమైన ఎఫ్‌డీవో మహిజ

బకాయిలు చెల్లిస్తేనే పక్షుల పండుగకు పడవలిస్తాం

- ఎఫ్‌డీవోకు తేల్చి చెప్పిన మత్స్యకార నాయకులు -

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2019 పక్షుల పండుగ సమయంలో ఏర్పాటు చేసిన పడవలకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లిస్తేనే వచ్చేనెల జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు పడవలను సమకూర్చుతామని మత్స్యకార నాయకులు ఎఫ్‌డీవో మహిజకు తేల్చిచెప్పారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మత్స్యకార నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా భీములవారిపాళెం పడవల రేవులో పడవ షికారు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం పడవలను సమరూర్చాలని కోరారు. మత్స్యకార నాయకులు స్పందిస్తూ ఆరేళ్లుగా తమ బకాయిల కోసం అధికారుల చుట్టూ తిరిగామని, 2020లో ధర్నా చేస్తే పోలీసులు తమపై కేసులు పెట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 పక్షుల పండుగ బకాయిలు చెల్లిస్తేనే పడవలు ఇస్తామని తేల్చిచెప్పారు. ఒక రోజుకు ఒక్కొక్క పడవకు రూ.7వేల అద్దె, పడవ నడిపే ముగ్గురు వ్యక్తులకు కూలి, భోజనాల కోసం రూ.3000 చొప్పున మొత్తం రోజుకు రూ.10వేలు అవుతుందని చెప్పారు. పాత బకాయిలు చెల్లించడంతో పాటు వచ్చే నెలలో పండుగకు అడ్వాన్స్‌గా కొంత చెల్లించాలని స్పష్టం చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు బొమ్మన పళణి, మనోహర్, సుధాకర్, ప్రకాష్, ఏకాంబరం, జయపాల్, వాసు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఐదుచోట్ల పక్షుల పండుగ

- ఏర్పాట్లను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

సూళ్లూరుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వచ్చే నెల 17నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఐదుచోట్ల పక్షుల పండుగ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులతో కమిటీలను కూడా నియమించారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, నేలపట్టు, బీవీపాలెం, శ్రీసిటీలో పక్షుల పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు పక్షుల పండుగ జరిగే జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్పలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షుల పండుగకు వచ్చే సందర్శలకు అవసరమైన వసతులు, ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గూడూరు డీఎల్‌డీవో వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ భవాని, ఏపీఎం ప్రసన్న కుమారి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అట్టకానితిప్పలో ఏర్పాట్ల గురించి తెలుసుకొంటున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీఎల్‌డీవో వాణి తదితరులు


పలమనేరు మండలంలోని సముద్రపల్లి


బేరుపల్లి


కూర్మాయి


మొరం చెరువులు

నిరాశ మిగిల్చిన తుపాన్లు

నీరు చేరని చెరువులు - బావురుమంటున్న రైతులు

పలమనేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళా ఖాతంలో ఏర్పడిన తుపాన్లు పలమనేరు నియోజకవర్గ ప్రజలకు నిరాశే మిగిల్చాయి. ఖరీఫ్ సీజన్‌లో నామమాత్రంగా వర్షాలు కురిసినా ఏటా సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో వచ్చే తుఫాన్ల కారణంగా కొన్నేళ్లుగా ఈ నియోజకవర్గ ప్రజలకు సాగునీటి కొరత లేకుండా వర్షాలు కురిసేవి. ఈ మూడు మాసాల్లో కురిసిన వర్షాలతో చెరువులు నిండి కలుజు పారి భూగర్భజలాలు గణనీయంగా వృద్ధి చెందేవి. అయితే రెండు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు కురిసి ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారిపోయినా పలమనేరు నియోజకవర్గంలోని చెరువులకు నీరు చేరకపోవడంతో రైతులు బావురుమంటున్నారు. 10రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసినా పలమనేరు నియోజకవర్గంపై మాత్రం ఈ తుఫాను ప్రభావం ఏమాత్రం లేదనే చెప్పాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వేరుశనగ విత్తే సందర్భంగా నామమాత్రంగా వర్షం కురిసింది. అటుపిమ్మట ఆకాశం మేఘావృతం అవుతున్నా వర్షం అంతంత మాత్రమే. దీంతో నియోజకవర్గంలో దాదాపు 450 చెరువులుంటే 400 చెరువుల్లో చుక్కనీరు లేని పరిస్థితి కొనసాగుతోంది. దీంతో ఏం సాగు చేయాలో దిక్కుతోచక రైతులు సతమతమవుతున్నారు.సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పిన రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. దీనికి తోడు పాడిఆవులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు.డిసెంబరు నెల కూడా ముగిసిపోతున్న నేపథ్యంలో ఇక జనవరినుంచి మేనెల వరకు వర్షాలు కురిసే అవకాశాలు పెద్దగా లేకపోవడంతో పాడి రైతులు పశుపోషణ కూడా భారమవుతుందని ఆందోళన చెందుతున్నారు.వేసవిలో భూగర్భజలాలు అడుగంటి తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.నియోజకవర్గం మీదుగా వేస్తున్న ఆరు లేన్ల బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు బైరెడ్డిపల్లి, పలమనేరు, వి.కోట మండలాల్లోని పలు చెరువుల్లో వేలాది టిప్పర్ల మట్టిని తరలించారు. దీంతో ఈ మట్టి తోడిన చెరువులు ఆనవాళ్లు కోల్పోయాయి. ఈ చెరువుల్లో ఉన్న కొద్ది పాటి నీరు కూడా కనుమరుగై పోయింది. రెండేళ్ల క్రితం పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు నిండి కలుజు పారాయి. పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో కౌండిన్య నది సైతం ఉధృతంగా ప్రవహించింది.ఈ నదిపై దాదాపు 20చోట్ల నాసిరకంగా నిర్మించిన చెక్‌డ్యాములు కొట్టుకుపోయాయి. భూగర్భజలాల వృద్ధి కోసం నిర్మించిన చెక్‌డ్యాంలు కొట్టుకు పోవడంతో నేడు కౌండిన్య నది పొడవునా నీరు కనిపించని పరిస్థితి.నదికిరువైపులా ఉన్న పొలాలవద్ద రైతులు వేసుకొన్న బోరుబావుల్లో కూడా నీరు అడుగంటి పోతున్నాయి.ఏ చెరువు ఆయకట్టు చూసినా బీడు భూములే కన్పిస్తున్నాయి. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల్లోని చెరువులకు నీటిని వదులుతారని దశాబ్దకాలంగా ప్రకటనలు చేస్తున్నారే గానీ అది వాస్తవరూపం దాల్చలేదు.


పెద్దపంజాణి మండలంలోని పెద్దపంజాణి చెరువు


పలమనేరు మండలంలో ఎండిపోయిన కౌండిన్య నది


బైరెడ్డిపల్లి మండలంలోని బైరెడ్డిచెరువు

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.97 కోట్లు

ఐరాల (కాణిపాకం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపార వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,97,76,188 లభించింది. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం కానుకలను ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. యూఎస్‌ఏ 1344, ఆస్ట్రేలియా 290, సింగపూర్ 80, కెనడా 10 డాలర్లతోపాటు 75 గ్రాముల బంగారు, 4 కిలోల 10 గ్రాముల వెండి లభించినట్లు ఈవో తెలిపారు. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.17,242, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.35,700 సమకూరినట్లు ఈవో వివరించారు. ఆలయానికి ఈ ఆదాయం పూర్తిగా 24 రోజుల్లో వచ్చినట్లు చెప్పారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, బాలరంగస్వామి, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


ఈవో పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ద్విచక్రవాహనం

బండకొత్తూరు యువకుడి దుర్మరణం

పూతలపట్టు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనంతో ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ లారీ రోడ్డుపక్కన ఆగి ఉంది. గుడుపల్లె మండలం బండకొత్తూరు గ్రామానికి చెందిన గోపి (24) పని నిమిత్తం తిరుపతికి వెళ్లి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. పూతలపట్టు మండలంలోని గాండ్లపల్లె సిక్స్‌లేన్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మఠం గొల్లపల్లెలో చోరీ

సత్యప్రమాణ భయంతో ఇంటి ముందు నగదు ప్రత్యక్షం

సోమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ మఠం గొల్లపల్లెలో రెండు రోజుల క్రితం గౌరమ్మ అనే మహిళ ఇంట్లో రూ.లక్ష నగదు చోరీ జరిగింది. గౌరమ్మ ఆ చోరీ గురించి గ్రామంలోని పెద్దల వద్ద తన గోడును చెప్పకుంది. కూలిపనులు చేసి కూడబెట్టిన సొమ్ము చోరీ అయిపోవడంతో దిక్కుతోచడం లేదని మొరపెట్టుకుంది.దీంతో గ్రామంలోని 50 కుటుంబాలు స్థానిక ఆలయం వద్ద సమావేశమయ్యాయి.తాము చోరీ చేయలేదంటూ సత్యప్రమాణాలకు నిలయమైన చౌడేపల్లె మండలం రాజనాల బండ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాణం చేసేందుకు ఇంటికి ఒకరు చొప్పున హాజరు కావాలని నిర్ణయించారు.దేవుడి ఎదుట ప్రమాణమనేసరికి గురువారం ఉదయానికల్లా చోరీకి గురైన లక్ష నగదును ఎత్తుకెళ్లినవాళ్లు గౌరమ్మ ఇంటి ముందు వదిలిపెట్టారు.

వరికి మద్దతు ధర ప్రకటన

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఖరీఫ్ పంటకు సంబంధించి 89,615 హెక్టార్లలో 5,60,093 ధాన్యం ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో వరికి మద్దతు ధర ప్రకటించినట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ, పౌరసరఫరా మార్కెటింగ్‌శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్య సేకరణ కేంద్రాలు ప్రారంభించాలని ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించినట్లు చెప్పారు. మద్దతు ధర కన్నా తక్కువకు రైతులు విక్రయించుకునే పరిస్థితి కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

లారీని ఢీకొని ఒకరి పరిస్థితి విషమం

ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో లారీ కింద పడిఉన్న రంజిత్ - తీవ్రంగా గాయపడిన రాహుల్ - గాయపడిన అయ్యప్ప

గంగవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి లారీని ఢీకొన్న ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమం కాగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గంగవరం బైపాస్ రోడ్డులోని డ్రైవర్స్‌కాలనీ సమీపంలో శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడులోని గుడియాత్తం తాలూకా గొల్లపల్లి గ్రామానికి చెందిన రాహుల్ (18), అయ్యప్ప(20), రంజిత్(18) బెంగళూరులో ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తూ గంగవరం సమీపంలోని బైపాస్ రోడ్డులో భోజనం కోసం హోటల్ వద్ద ఆపారు. భోజనం చేసి బయలుదేరి వెళ్తూ లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో రాహుల్, అయ్యప్ప, రంజిత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో రాహుల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం చిత్తూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

జగన్ పాపాలే విద్యుత్ రంగానికి శాపాలు : టీడీపీ

చిత్తూరు సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగన్ పాపాలే విద్యుత్ రంగానికి శాపాలుగా మారాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపైనే వైసీపీ శ్రేణులతో ధర్నాలు చేయించిన ప్రబుద్ధుడు మాజీ సీఎం జగన్ రెడ్డి అని ఎద్దేవ చేశారు. పిచ్చి తుగ్లక్‌కు ఏమాత్రం తీసిపోను అని మరోసారి రుజువు చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లలో భారీ అక్రమాలకు పాల్పడిందని చెప్పారు. 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని, రూ.1,29,000 కోట్ల భారాన్ని జనంపై మోపిందన్నారు. జెన్కో విద్యుత్ ప్లాంట్ల ద్వారా యూనిట్ రూ.5 వచ్చే దాన్ని కాదని కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.14 వరకు కొనుగోలు చేశారన్నారు. ఇకనైనా జగన్ తన తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో వైసీపీకి రాజకీయ మనుగడే ఉండదని హెచ్చరించారు. నేతలు మోహన్‌రాజ్, టీకే శ్రీనివాస్, జాఫర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ● జగన్ అసమర్థత, అవినీతి పాలన వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చిత్తూరు టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం ఒక ప్రకటనలో తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారుల మరణాలే అత్యధికం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల మరణాలే అత్యధికమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతాకమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఎస్పీ మణికంఠతో కలిసి కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా 24 బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ సమస్యాత్మక జంక్షన్లు, స్కూల్ జోన్లు, కాలేజీలు, హాస్పిటల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రంబుల్‌స్ట్రిక్స్ ఏర్పాటు చేయాలని కమిషనర్లను ఆదేశించారు. ఈ ఏడాది నవంబరు వరకు నమోదైన 693 రోడ్డు ప్రమాదాల కేసుల్లో 364 మంది మరణించడం జరిగిందన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు ఏడురోజుల వరకు రూ.1.50 లక్షల నగదురహితంగా చికిత్స అందించే పథకంపై అవగాహన కల్పించాలని చెప్పారు. చాలాచోట్ల జాతీయ రహదారుల వద్ద సైన్‌బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్డీవో నిరంజన్ రెడ్డి, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాతా, శిశు మరణాల నియంత్రణ దిశగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మెటర్నల్ డెత్‌లకు సంబంధించి సమీక్షించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్, ఎస్పీ

డ్రగ్స్ బారినుంచి యువతను కాపాడుకుందాం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ బారి నుంచి యువతను కాపాడుకుందామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాళ్లతో నార్కోటిక్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాబోధనే కాకుండా, విద్యార్థులను దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లపై ఉందన్నారు. ప్రతి విద్యాసంస్థలోనూ డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మత్తుపదార్థాలకు బానిసైనా లేదా వాటిని సరఫరా చేస్తున్నా.. వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటువంటి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు లేదా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్ సరఫరాకు సంబంధించి 177 కేసులను నమోదు చేయడం జరిగిందని వివరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, ఆర్ఐవో పాల్గొన్నారు.

తక్కువ ధరకు వస్తువులంటూ మోసం

● కల్లూరు పోలీసుల అదుపులో నిందితుడు

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు స్కూటీ, ఫ్రిజ్, ఏసీ తదితర వస్తువులు ఇస్తానని మాయమాటలు చెప్పి ఇద్దరు వ్యక్తుల నుంచి నగదు కాజేసిన వ్యక్తిపై కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు ...పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన మహబూబ్‌బాషాకు ఈనెల 19వ తేదీన కురవపల్లికి చెందిన సుధాకర్ అంటూ ఫోన్ చేసి పరిచయం చేసుకున్నాడు. తన వద్ద ఉన్న స్కూటీ, ఫ్రిజ్, ఏసీ మెషిన్ తక్కువ ధరకు అమ్మేస్తానని నమ్మబలికాడు. తక్షణం తాను పంపుతున్న క్యూఆర్ కోడ్‌కు నగదు వేస్తే వస్తువులు తీసుకొస్తానని పదే పదే ఆ వ్యక్తి ఫోన్‌చేశాడు. దీంతో మహబూబ్‌బాషా బెంగళూరులో ఉన్న తన కుమారుడు సలీంకు విషయం చెప్పాడు.దీంతో సలీం తన అకౌంట్ నుంచి అదే రోజు క్యూఆర్ కోడ్‌కు నాలుగు దఫాలుగా రూ.48 వేలు బదిలీ చేశాడు. కొంత సేపటికి ఆ ఫోన్ నెంబరుకు మహబూబ్ బాషా ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గుర్తించాడు. చిత్తూరు నగరం కట్టమంచికి చెందిన అరుణ నీరజాక్షులు నాయుడు దంపతులు కల్లూరు పట్టణంలో పాల వస్తువుల దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. పులిచెర్ల మండలం చల్లావారిపల్లికి చెందిన సుధాకర్ అంటూ పరిచయం చేసుకొని వారి దుకాణంలో పాలు, పెరుగు తదితరాలను ఏడాది కాలంగా కొనుగోలు చేస్తున్నాడు.ఈ నెల 17వ తేదీన తన భార్య అనారోగ్యంతో ఉందని, ఆపరేషన్ కోసం డబ్బులు కావాలని అడిగాడు.ఇదే సమయంలో సుధాకర్ బాబాయ్‌గా రాజు అనే మరో వ్యక్తి ఫోన్ చేసి సుధాకర్ డబ్బులతో ఇబ్బంది పడుతున్నాడని తెలిపాడు.వారిద్దరి మాటలు నమ్మిన అరుణ రూ.1.50 లక్షలు అందజేసింది. ఈనెల 20వ తేదీన సుధాకర్‌గా చెప్పుకుంటున్న వ్యక్తి తన బాబాయ్ స్కూటీ తక్కువ ధరకు ఇస్తాడని, తాను పంపే క్యూఆర్ కోడ్‌కు నగదు పంపాలని అరుణకు చెప్పడంతో రూ.15వేలు తన అకౌంట్ నుంచి బదిలీ చేసింది. అనంతరం వారి ఫోన్ నెంబర్లు స్విచ్ ఆఫ్ కావడంతో మోసాన్ని అరుణ గుర్తించింది. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఇద్దరిని మోసం చేసిన నిందితులు వాడిన కొన్ని ఫోన్ నెంబర్లు ఒకటిగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.నిందితులు వాడుతున్న ఫోన్ నెంబరు టవర్ లొకేషన్ ఆధారంగా ప్రొద్దుటూరు సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకొని కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారు.రెండు కేసుల్లో నిందితులు ఒకే ముఠాకు చెందినవారని బాధితురాలు అరుణ తెలిపింది.



మొదటి ఘాట్‌లో కొండకు వెలుగులు

తిరుమల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి వెళ్లే భక్తులతో తిరుపతి నగరవాసులకు ఆహ్లాదకరంగా ఉండేలా మొదటి ఘాట్‌లోని వినాయకస్వామి ఆలయం వద్ద కొండకు నూతన లైట్లను అమర్చారు. గతంలో ఇదే ప్రాంతంలో లైట్లు ఉండేవి. రాత్రి వేళల్లో లైట్ల వెలుగుల్లో కొండలు సౌందర్యవంతంగా కనిపించేవి. అయితే వైల్డ్‌లైఫ్ అభ్యంతరాలతో పాటు వివిధ కారణాలతో ఆ లైట్లను తొలగించారు. ఈక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తిరిగి ఆ లైట్లను ఏర్పాటు చేయించి, భక్తులకు, స్థానికులకు కనువిందు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో టీటీడీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు ట్రయల్‌రన్ కింద ఆరు ఫోకస్ లైట్లను అమర్చారు.

మాజీ ప్రధాని మృతికి సంతాపంగా..

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ జెండాను అవనతం చేశారు. ఈనెల 26వ తేదీనుంచి 2025 జనవరి ఒకటో తేదీవరకు కేంద్రం సంతాప దినాలుగా ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వారంపాటు ఎటువంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించరు.


కలెక్టరేట్‌లో జాతీయ జెండా అవనతం

భూముల ధరల పెంపు వాయిదా

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూముల ధరల పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం వాయిదా వేసింది. దాంతో జనవరి ఒకటో తేదీనుంచి కొత్త మార్కెట్ విలువలు అమల్లోకి రావడం లేదు. ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం చేసిన కసరత్తు మరో నాలుగు రోజుల్లో అమల్లోకి రావాల్సి ఉండగా ఆగిపోయింది. దీంతో శనివారం జేసీ విద్యాధరి అధ్యక్షతన భూవిలువల పెంపుపై జరగాల్సిన జిల్లా మార్కెట్ వేల్యూ రివిజన్ కమిటీ సమావేశం రద్దయ్యింది. జిల్లావ్యాప్తంగా 0-20శాతం మేర కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలుచేయాలని నిర్ణయించగా, రూ.30కోట్ల నుంచి రూ.40 కోట్ల మేర విలువల పెంపు ఉండాల్సి ఉండింది. ధరలు ఇప్పట్లో పెంచవద్దంటూ వివిధ వర్గాల నుంచి వినతులు అందిన దృష్ట్యా ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I Chitati Malliswari (old Name) W/o Chitteti Venkatramaiah, R/o 2/7, Malemarpuram, chitvel, Annamayya DT AP.I Have Changed My Name & Sur Name As CHITTETI MALLISWARI (New name).
AJT - 200735

CHANGE OF NAME
I Chitati Venkataramana (old Name) S/o Chitteti Chalapathi, R/o 2/7, Malemarpuram, chitvel, Annamayya DT AP.I Have Changed My Name & Sur Name As CHITTETI VENKATRAMAIAH (New name)
AJT - 200736

WANTED
Female Office Assistant - looking for a skilled individual to provide administrative support. Proficient in MS Office,Tally,filing GST, PF & ESI returns. Salary: 20,000/- + PF & ESI benefits 9949008909, 9700799989
AJT - 4868

CHANGE OF NAME
I, Arani Vardarajulu S/o Arani Munirathnam (Old Name) R/o D. No 18-5-309,2nd Floor, Sapthagiri Nagar, K.T.Road, Tirupati Urban Mandal, Tirupati Dt AP I Have Changed My Name To Arani Varadarajulu For All Purposes.
AJT - 4869

CHANGE OF NAME
I, TIRUVEEDI MOUNIKA(Old Name), D/o TIRUVEEDI RAVINDRA BABU, residing at # 4-1425, Vellore Road, Greamspet, Chittoor Town and District, AP-517002 hereby declare that I have changed my name as TIRUVEEDI RAVINDRABABU MOUNIKA (New Name) for all future purposes
AJT - 4541

CHANGE OF NAME
I, Pandillapalli Krishna (Old Name), R/o: VR Agraharam, Bodevandlapalli, Tirupati Dt, A.P. Do Here By Declared I Have Changed My Name As Pandillapalli Krishna Reddy (New Name) S/o Pandillapalli Pullareddy
AJT - 4867

PLOT FOR SALE
తిరుపతి ద్వారకానగర్, Opp.S.V. అగ్రికల్చర్ కాలేజ్ వద్ద 80 అంకణముల (నార్త్ ఈస్ట్ కార్నర్) & 120 అంకణములు నార్త్‌ఫేస్ అమ్మబడును. సెల్: 89703 33399
AJT-4841

WANTED
Immediate joining for AYYAPPA AGENCIES Banking Collections Dept (HDFC & SBI & HDB), required Backend (MIS excel), TEAM LEADERS - 1+yrs exp, Collection executives both fresher & exp can apply location : TIRUPATI. Mob: 8801124686/ 6281439512
AJT - 4863

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పిక్కింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 224853

WANTED
Wanted Telecallers - For Leading Educational consultancy in Tirupati. Part-time and Full-time Call: 7093836226
AJT - 4846

సర్వీసెస్
⇒ వ్యవసాయ భూములకు, రైతులకు, పర్సనల్‌కు, వ్యాపారస్తులకు, ఇండస్ట్రీస్‌లకు మొ॥ వారికి సహాయం ఇవ్వబడును. సంప్రదించండి సెల్ : 9063290864.
AJG-204012

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, లట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఫటా ఫట్?

18 గంటల పనితో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు


కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆశయాలకు అనుగుణంగా రోజులో 18 గంటలు పనిచేయడంతో కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి, ప్రజా సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. కుప్పం అభివృద్ధి, ప్రజలకు కల్పించిన మెరుగైన మౌలిక సదుపాయాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

? ముఖ్యమంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణ

! రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాలలో కచ్చితంగా కుప్పం మున్సిపాలిటీ ప్రత్యేకమైంది. ఇక్కడ నిరంతరం ముఖ్యమంత్రి ప్రత్యక్ష, పరోక్ష పర్యవేక్షణ ఉంటుంది. వర్క్ కల్చర్ ఉన్న సీఎం. ఆయన లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాలలో రోజుకు 18 గంటలు పనిచేయడంతో నేను, నా సిబ్బంది సామర్థ్యాన్ని నిరూపించుకుంటాం. పనిచేస్తూ పోతే ఫలితాలు సానుకూలంగా ఉంటాయని నమ్మేవాడిని నేను.

? సిబ్బంది కొరత

! మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉన్నది నిజమే. కుప్పం గ్రేడ్ 3 మున్సిపాలిటీ. మేనేజరు, సీనియర్ అసిస్టెంట్, ఇంజనీరు, టీపీఎస్ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. 12 సచివాలయాలలో కేవలం 18 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. అయితే వీళ్ల ఏమాత్రం చాలరు. 18 గంటల పనితో సిబ్బంది కొరతను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నాం. అంతేకాక కుప్పం మున్సిపాలిటీకి 44 మంది సిబ్బంది అవసరమని ప్రభుత్వం భావించి, ఆమేరకు చర్యలు ప్రారంభించింది. దీనికి క్యాబినెట్ ఆమోదం లభించింది. మరో 15, 20 రోజుల్లో ప్రభుత్వం 44 మంది సిబ్బందిని కేటాయించే అవకాశం ఉంది. అప్పుడు మరింత మెరుగైన సేవలను ప్రజలకు అందివ్వగలమన్న నమ్మకం ఉంది.

? అభివృద్ధి పనులపై చర్యలు

! కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేకమైన దృష్టి సారించారు. రూ.10 కోట్ల రూర్బన్ నిధులు ఉన్నాయి. ఈ నిధులతో పట్టణంలోని పలు ప్రాంతాలలో 18 దుకాణ సముదాయాలకు టెండర్లు పిలిచాం. పదో ఆర్థిక సంఘం నిధులు రూ.6 కోట్లతో తాగునీటి బోర్లు, రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేశాం. ఈ పనులకు మున్సిపల్ కౌన్సిల్ అనుమతి కావాలి. ఫిబ్రవరి 6 లోపు కౌన్సిల్ సమావేశం నిర్వహించి అనుమతి పొంది, ఆయా అభివృద్ధి పనులు చేపడుతాం. ప్రస్తుతం పట్టణంలోని కూడళ్లు, డివైడర్లలో పచ్చదనాన్ని పెంచి పట్టణ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాం. అదనంగా కుప్పం అభివృద్ధి కోసం రూ.456 కోట్ల అంచనా వ్యయంతో వివిధ పనులతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. నేడో రేపో ఆ నిధులు మంజూరైతే రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా కుప్పం మున్సిపాలిటీ నిలుస్తుందన్నమాట సత్యమవుతుంది.

? ఆదాయం పెంచుకోవడానికి చర్యలు

! ఆదాయానికి, వ్యయానికి మధ్య రూ.5 కోట్ల మేర వ్యత్యాసముంది. ఆదాయం రూ.5 కోట్లు అయితే, వ్యయం ఏకంగా రూ.10 కోట్లకు చేరుతోంది. ఈ వ్యత్యాసమంతా విద్యుత్తు చార్జీల భారమే. అయితే ఆదాయాన్ని పెంచుకోవడానికి పలు మార్గాలు అనుసరిస్తున్నాం. కొత్తగా కడుతున్న నిర్మాణాలను పన్ను పరిధిలోకి తేవడం, కచ్చితంగా ఇంటి నిర్మాణ ప్లాన్ అప్రూవల్ చేసుకునేలా చూడటం, ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అదనపు నిర్మాణాలు ఉంటే వాటిని పన్ను పరిధిలోకి తేవడం, మున్సిపల్ పరిధిలోని లే అవుట్లకు కచ్చితంగా మున్సిపల్ అప్రూవల్ ఉండేలా కఠిన నిబంధనలు అమలు చేయడం వంటివి ఆదాయాన్ని పెంచుకునేందుకు అనుసరిస్తున్న ప్రధాన మార్గాలు. ఇంతకుముందు చెప్పినట్లు అదనంగా దుకాణ సముదాయాలు నిర్మించి వాటి అద్దెలతో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.

ఇష్టారాజ్యంగా పన్నుల భారం


ఆనందబాబు

పలమనేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలపై ప్రభుత్వం విధించే పన్నులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని ఏపీఎన్జీవో సంఘం పలమనేరు అధ్యక్షులు ఆనందబాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యంగా వేతన జీవులు రకరకాల పన్నులతో ఇబ్బందులు పడుతున్నారని.. ఆదాయపు పన్ను 5 శాతం నుంచి గరిష్ఠంగా 30 శాతం వసూలు చేస్తున్నా ఆ పన్నులు చెల్లించి మళ్లీ మిగిలిన ఆదాయం నుంచి చేసే ఖర్చులపై జీఎస్టీ రూపంలో మరో 5 శాతం నుంచి 28 శాతం వరకు వసూలు చేస్తున్నారని.. మధ్య తరగతి కుటుంబాలపై తీవ్రమైన భారం మోపుతున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు మన దేశంలోనే ఉన్నాయన్నారు. కనీసం నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదన్నారు. అన్ని నిత్యావసర వస్తువులు మండుతున్నా ఉద్యోగులకు ఆరునెలలకు ఇవ్వాల్సిన కరవు భత్యం మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. పిల్లలు ఇష్టంగా తినే పాప్‌కార్న్, తినే రొట్టెలపై 5 నుంచి 18 శాతం వరకు పన్నులు విధించడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా హెల్త్ సెంటర్


ఉపయోగంలో లేని హెల్త్ సెంటర్

సోమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్వహణకు నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. నడింపల్లె సచివాలయానికి అనుబంధంగా లక్షలు వ్యయం చేసి నిర్మాణం చేసిన భవనాలకు తాళం వేసి వదిలేశారు. విలేజ్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సేవలు అందడం లేదు. రైతులకు సలహాలు ఇవ్వడానికి సిబ్బంది లేరు. దీంతో వీటిని ప్రారంభించిన అధికారులు ఉపయోగంలోకి తీసుకురాలేకపోయారు. భవనాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. చీకటి పడితే మందుబాబులకు అడ్డాగా మారుతోంది. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

5న 'చలో విజయవాడ' విజయవంతం చేయాలి

సోమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని.. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేయాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. శుక్రవారం కందూరు, వల్లిగట్ల, తమ్మినాయనపల్లెలో కరపత్రాలను పంపిణీ చేసి ఆలయాలను రక్షించుకుందామంటూ ప్రచారం నిర్వహించారు. వీహెచ్‌పీ నాయకులు, సమరసతా ఫౌండేషన్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, పుంగనూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన లోగట్టు ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి చిత్తూరు జిల్లా, పుంగనూరు, గుడిసెబండ, పెంచుపల్లి, డో.నెం. 4-51లో కాపురముండు తోటి జయమ్మ, భర్త తోటి జనార్దన గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని తోటి జయమ్మ గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి హక్కులు, దావాలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : చిత్తూరు డి., పుంగనూరు సబ్.డి., పుంగనూరు మండలం మరియు యం.పి.పి.గుడిసెబండ గ్రామ పంచాయితీ, బట్టందొడ్డి సర్వే గ్రూపు, పుంగనూరు రెవిన్యూ, పెంచుపల్లి గ్రామ లెక్క దాఖలా, పుంజ 518ఏ2పూరాఏ. సెం:2-66 పైకి ఎ.సెం.1-281/2 పైకి 2వ అంటుబంటబాటి జాగా కొలతల వివరం: తూర్పు-పడమర, ఉత్తర దిశలో అడుగులు:61(మీ:18.593), తూర్పు - పడమర, దక్షిణం దిశలో అడుగులు: 61(మీ:18.593) ఉత్తరం-దక్షిణం, తూర్పు దిశలో అడుగులు : 63 (మీ:19.202) ఉత్తరం-దక్షిణం, పడమర దిశలో అడుగులు : 55 (మీ:16.764) లెక్క 398.86 చ.గ.లు గల ఖాళీ జాగా పూరా. ఇందుకు చెక్కుబందు: తూర్పు:బైపాస్ రోడ్డు, పడమర:గంగాధరం ఖాళీ జాగా ఉత్తరం:దామోదర్ రెడ్డి ఖాళీ జాగా, దక్షిణం: పురుషోత్తం, యోగమూర్తి, మల్లికార్జున వీర్ల ఖాళీ జాగాలు. ఈ మధ్యస్థ కనిన కొలతలలో గల ఖాళీ జాగాపూరా. ప్రస్తుతం ఇందులో ఎలాంటి కట్టడములు గాని లేవు.

ఎ.ఆనందకుమార్, అడ్వకేట్, తిరుపతి, సెల్ : 9866509592

నెలాఖరులోపు సిలబస్ పూర్తిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వరలక్ష్మి

పలమనేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలాఖరులోపు సిలబస్ పూర్తిచేయాలని డీఈవో వరలక్ష్మి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం పలమనేరులో డివిజన్ పరిధిలోని 10 మండలాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జనవరి నుంచి పదో తరగతి విద్యార్థులకు రివిజన్ ప్రారంభించాలని.. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. జనవరి 6లోపు పరీక్షలపై చర్చా కార్యక్రమాలను పూర్తిచేయడానికి తగిన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ వివరాలను అందజేయడంతోపాటు టీచర్స్, స్టూడెంట్స్ అటెండెన్సు తప్పనిసరిగా వేయాలన్నారు. వర్షాలు కారణంగా విద్యార్థులను ఇబ్బందులు లేని తరగతి గదుల్లో కూర్చోబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి, బాలసుందరం, గంగవరం ఎంఈవో వేణుగోపాల్, చిత్తూరు జిల్లా ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

సోమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనవరి ఒకటో తేదీన జరగాల్సిన ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. లబ్ధిదారులు పింఛన్లు పొందాలని ఆయన కోరారు.

మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులు

సోమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ పీఎం మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటని సోమల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాబునాయుడు అన్నారు. శుక్రవారం సోమలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కపిల సుబ్రహ్మణ్యం, వల్లీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పశుపరిశోధన స్థానం

● రైతు శిక్షణ కేంద్రంలో సిబ్బంది కాపురాలు ● పట్టించుకోని అధికారులు


రూ. 89 లక్షలతో ఆరేళ్ల క్రితం నిర్మించిన రైతు శిక్షణ కేంద్రం


రైతు శిక్షణ, వసతిగృహంలో సిబ్బంది ఏర్పాటు చేసుకొన్న మంచాలు

పలమనేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలో 2018లో నిర్మించిన రైతు శిక్షణ, వసతి గృహం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. రైతులకు పశుపోషణ, పాడిఆవుల పెంపకం, పాడి ఆవులకు వచ్చే వ్యాధులు, నివారణ తదితర మెలకువలు తెలియజేసేందుకు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రూ.89 లక్షల వెచ్చించి ఈ రైతు శిక్షణ, వసతిగృహం నిర్మించారు. ఈ భవనాన్ని 2018 ఏప్రిల్ 9న అప్పటి పరిశ్రమలశాఖ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే రైతుల శిక్షణ కోసం నిర్మించిన ఈ భవనం గత ఆరేళ్లుగా వృథాగా ఉంది. అయితే ఈ భవనంలో కొందరు ఏకంగా కాపురాలే పెట్టేశారు. కొందరు సిబ్బంది ఈ వసతిగృహాన్ని వినియోగించుకుంటూ అక్కడే వంటావార్పు సైతం చేసుకొంటున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో రైతుల శిక్షణ కోసం నిర్మించిన ఈ భవనాన్ని అధికారులు వృథాగా ఉంచడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి


చీలేపల్లె సచివాలయంలో...

కుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని చీలేపల్లె సచివాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతోపాటు టీడీపీ నాయకులు మాణిక్యం, ప్రతాప్ సింహ, రాజేశ్, మురుగేశ్, హరీశ్, వేణు, కమల్, రమేశ్, క్రాంతి, నటరాజ్, జగన్మోహన్ పాల్గొన్నారు.

● సోమల: తమ్మినాయనపల్లెలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు బెన్నురాజ్ ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బాలసుబ్రహ్మణ్యం, సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఆర్ఐ సుబుక్తుల్లా, మంజునాథ్, సీఈసీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: కూటమి ప్రభుత్వంలో ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారని టీడీపీ నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, మణిరాజు పేర్కొన్నారు. శుక్రవారం అమినిగుంట పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, ఆర్ భారతి, వీఆర్‌వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●పుంగనూరు: మండలంలోని నెక్కుందిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రాము తెలిపారు. సమావేశంలో ఆర్ఐ పణికుమార్, వీఆర్వో , రైతులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: గౌనితిమ్మేపల్లె గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాధవరాజు, టీడీపీ నాయకులు మంజునాథరెడ్డి, శంకరప్ప, శేషగౌడు, బాబు, రామచంద్ర, దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

బీసీఎన్ విద్యాసంస్థల సిబ్బందికి గ్రూప్ బీమా సౌకర్యం


ప్రయోగ పరికరాలు వితరణ చేస్తున్న బీసీ నాగరాజ్ తదితరులు

కుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న 449 మంది బోధన, బోధనేతర సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల వంతున మొత్తం రూ.22.5 కోట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్‌ను సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ ప్రకటించారు. ఆయన జన్మదినంతోపాటు వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కారణంగానే తమ సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. అనంతరం విజలాపురం కేజీబీవీ పాఠశాలలో నూతనంగా నిర్మించిన భౌతిక, రసాయన శాస్త్ర ప్రయోగశాలకు సుమారు రూ.1.50 లక్షల విలువగల పర్నిచర్, ప్రయోగ పరికరాలు వితరణ చేశారు. పీఈఎస్ వైద్య కళాశాల, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది కలిసి 50 యూనిట్ల రక్తదానం చేశారు. బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్, సీఈవో ఎన్.సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ కోదండరామయ్య గ్రంథాలయాధికారి సీజీ.శరవణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్ కుమార్, పీఈఎస్ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, పీఆర్వోలు భాస్కరన్, ధనశేఖర్ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు


ఇద్దరి అరెస్టును చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నల్లగుట్లపల్లెతాండా, పత్రపల్లెతాండాలో దాడులు నిర్వహించి నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే పెద్దతాండాకు చెందిన బుక్యా బాబునాయక్ వద్ద 10 లీటర్లు, పత్రపల్లెతాండాకు చెందిన మునెమ్మ వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పెద్దపంజాణి మండలంలోని చీకలదిన్నె గ్రామానికి చెందిన శివశంకర్ వద్ద కర్ణాటక మద్యం 40 ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో చిత్తూరు సీఐలు జవహర్‌బాబు, మోహన్, ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో ఆర్డీవో విచారణ


అమ్మవారి ప్రసాదాలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

చౌడేపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోయకొండలో రోడ్డు విస్తరణతో నష్టపోయిన బాధితులను ఆర్డీవో భవాని శుక్రవారం విచారించారు. కలెక్టర్ ఆదేశాలతో విచారించి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. కాటిపేరికి చెందిన వీరభద్ర తన పొలం కొందరు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆమె బోయకొండ గంగమ్మను దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఆమెకు అమ్మవారి ఫోటో, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో డీటీ మాధవి, సర్వేయర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవనాల ప్రారంభోత్సవం వాయిదా

పలమనేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాల సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈనెల 29న ఉదయం 11 గంటలకు సుప్రీంకోర్టు జడ్జి ఎఫ్.వి.భట్, హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా ప్రారంభించాల్సింది. అయితే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా కేంద్రం వారం రోజులపాటు సంతాప దినాలు ప్రకటించినందున వాయిదా పడినట్లు తెలిపారు.

మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయూబ్, అల్తాఫ్, ముబారక్, ఫయాజ్, షాన్‌వాజ్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

●పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్వో రవిరెడ్డి , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి డీసీసీ కార్యదర్శి రమణప్ప, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలావతి శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

నేడు బైరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలోని రాయల్‌మహల్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు గుర్రంకొండకు చెందిన రిడో సేవాసంస్థ ఆధ్వర్యంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఉచితవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అన్నిరకాల సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 లోపు యువతీ, యువకులు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఆసక్తి కలిగిన యువతీ, యువకులు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్‌లను స్థానిక మెప్మా కార్యాలయంలో అందించాలన్నారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషన్, ఏసీ, గీజర్, టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ రిపేర్లు, బ్యూటీషన్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు మెప్మా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విడవని వర్షం

సోమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి నుంచి సోమల మండలంలో మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో పాటు చలి తీవ్రతతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేకపోయారు. ఈక్రమంలోనే సోమల-నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంక, గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

కారు ఢీకొని బాలుడికి గాయాలు

చౌడేపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూరుకు చెందిన మునిరాజ కుమారుడు తరుణ్ (8) మూడో తరగతి చదువుతున్నాడు. బోయకొండ - చౌడేపల్లె ప్రధాన రోడ్డు వద్దనే ఇల్లు ఉండటంతో ఆడుకుంటుండగా గుర్తు తెలియని కారు తరుణ్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో బాలుడికి గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు చేయించారు.

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ఎన్టీఆర్ పింఛన్ లబ్ధిదారులకు ఈనెల 31వ తేదీన ఒక రోజు ముందే పింఛను నగదును పంపిణీచేయనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి నగదు అందజేస్తారని.. సహకరించాలని ఎంపీడీవో కోరారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

పలమనేరు, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పురపాలక సంఘ పరిధిలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ మరమ్మతులు చేయడానికి... బ్యూటీషన్ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తామ.. నిరుద్యోగులు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎంపీ రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ మీటింగ్ హాల్‌లో ఆర్పీల సమావేశం జరిగింది. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు వీల్‌చైర్ వితరణ



పుంగనూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోగుల కోసం శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వీల్‌చైర్ వితరణ చేశారు. స్థానిక ఆసుపత్రిలో మానవత సభ్యులు నాగరాజబాబు, రాజకుమారి దంపతులు వీల్‌చైర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారికి అందజేశారు. కార్యక్రమంలో మానవత ప్రతినిధులు డాక్టర్ ప్రభాకర్, ఏసీ నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, హరినాథరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపెడుతున్న పోలీసులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని దుకాణాల్లో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడైన కర్ణాటక రాష్ట్రం డీనజ్జుపల్లె గ్రామానికి చెందిన దేవేంద్రను దేవదొడ్డిక్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పలమనేరు రూరల్ సీఐ మురళీమోహన్, బైరెడ్డిపల్లె ఎస్ఐ పరశురాముడు తెలిపారు. ఈ కేసులో నిందితుడి వద్ద నుంచి రూ.1,30,000 విలువైన సిగరెట్ ప్యాకెట్లు, ఎల్ఈడీ టీవీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైష్ణవీదేవికి సూర్యకిరణాభిషేకం

చౌడేపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో శుక్రవారం సూర్యకిరణాలు అమ్మవారి నుదిట తాకి సూర్యకిరణాభిషేకం చేశాయి. అమ్మవారికి ఆలయ నిర్వాహకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారికి చీరలు, రవికలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాహుకాలంలో ప్రత్యేకంగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : వైసీపీ


వినతిపత్రం అందిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ


కుప్పం రెస్కో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైసీపీ ఎమ్మెల్సీ భరత్ తదితరులు


ఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందిస్తున్న పెద్దిరెడ్డి తదితరులు

కుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు కుప్పంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఊరేగింపుగా రెస్కో కార్యాలయానికి వెళ్లి ఎండీ సోమశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు.

●పుంగనూరు: విద్యుత్ ఛార్జీల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వైసీపీ పోరుబాటలో భాగంగా శుక్రవారం పుంగనూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లో వైఎస్ఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీం బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, కొండేటి నాగభూషణం, వెంకటరెడ్డియాదవ్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●పలమనేరు: పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ పలమనేరులో వైసీపీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఏడీఈ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు కృష్ణమూర్తి, చెంగారెడ్డి, మురళీకృష్ణ, చలపతిరెడ్డి, ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డీఎంహెచ్‌వో సుధారాణికి ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా వినతిపత్రం అందజేశారు. శుక్రవారం డీఎంహెచ్‌వోను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో లిఫ్ట్ పనిచేయడం లేదని, తాగునీటి వసతి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే జగన్మోహన్‌ను కూడా కలిసి సన్మానించారు. ఇమ్రాన్, గిరిశ్రీనివాస్, భాస్కర్, మునిశేఖర్, ముఖేష్, నరేష్, రవికుమార్ రులు పాల్గొన్నారు.

గంగపుత్ర సొసైటీ కార్యవర్గం ఎన్నిక



బంగారుపాళ్యం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల గంగపుత్ర సొసైటీ ఎన్నికలు శుక్రవారం జరిగినట్లు మత్స్యశాఖ ఎన్నికల అధికారి రామ్మోహన్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా నాగరాజ, ఉపాధ్యక్షుడిగా రెడ్డెప్ప, కార్యదర్శిగా కేశవులు, డైరెక్టర్లుగా మోహన్‌బాబు, రాజేంద్ర, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాసులు, ఉమాపతి, చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం ఐదేళ్లపాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పుల్లయ్య, ఫిషరీ అసిస్టెంట్ గౌరీ, మైఖేల్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై దృష్టి సారించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలపై సహిత విద్య టీచర్లు దృష్టి సారించాలని రాష్ట్ర కోఆర్డినేటర్లు నరసింహ, మల్లికార్జున, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం ఓ పాఠశాలలో సహిత విద్య కార్యక్రమాలపై ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని 31 భవిత కేంద్రాల్లో 750 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యను అందిస్తున్నామని చెప్పారు. వీరికి ప్రభుత్వం రవాణా, ఇంటివద్దే విద్య, విద్యార్థినులకు స్టైఫండ్, అవసరమైన వినికిడి, చేతికర్ర, ట్రైసైకిళ్లు, విద్య కిట్లు ఇస్తున్నట్లు వివరించారు. హైదరాబాదులోని బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రిలో గ్రహణం మొర్రి ఆపరేషన్లు చేయిస్తున్నామని తెలిపారు. ఐఈ కోఆర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు, ఎంఈవో 1,2, సహిత విద్య టీచర్లు, ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల కూల్చివేతపై జడ్పీ సీఈవో పరిశీలన



ఐరాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐరాల ఎల్ఆర్ వీధికి సమీపంలో ఉన్న ఇళ్ల వద్ద ఈనెల 16న ఓ భవంతికి సంబంధిన మరుగుదొడ్లు శిథిలావస్థలో ఉండటంతో పంచాయతీ అధికారుల సహకారంతో సిబ్బంది కూల్చివేశారు. ఈ విషయంపై భవన యజమాని భార్య హేమలత పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించడానికి జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డీపీవో సుధాకర్‌రావు శుక్రవారం విచ్చేశారు. మరుగుదొడ్లను కూల్చివేసిన స్థలాన్ని పరిశీలించి.. నివేదికను జాయింట్ కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఏడాది జైలు



నిందితుడు జార్జిలి

చిత్తూరు లీగల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీ చేసిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలుశిక్ష పడింది. బంగారుపాళ్యం మండలం మొగిలిమిట్టూరుకు చెందిన జ్ఞానశేఖర్ తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఆపి ఉంచారు. ఈ వాహనాన్ని అదే మండలంలోని కొదలమడుగుకు చెందిన జార్జిలి అపహరించుకెళ్లాడు. ఈ చోరీపై బంగారుపాళ్యం పోలీసులు ఈ ఏడాది మే 24వ తేదీన కేసు నమోదు చేశారు. నిందితుడైన జార్జిలిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు రాగా, పూర్వాపరాలు పరిశీలించాక నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఉమాదేవి తీర్పునిచ్చారు.

నిశిత పరిశీలన అవసరం

వెదురుకుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికీ బాల్య దశ నుంచే నిశిత పరిశీలన అవసరమని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలలో వ్యాక్సినేషన్లు, పెన్సిలిన్, రాబిస్ ఆవిష్కర్త ఫాదర్ ఆఫ్ మైక్రో బయాలజీ లూయి పాశ్చర్ జయంతి నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు రాములు, ఢిల్లీబాబు, వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు, రంజిత్‌కుమార్, హరిత, మాలతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన



విజయపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విజేతలు శనివారం మండల స్థాయిలో పాల్గొంటారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విజయచంద్రిక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, రాధాకుమారి, సునీత, వెంకటేసులు, విజయవర్మ, వెంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకు మార్కెట్ వేలం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్లకు వేలం పాట నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహించగా, ఆరుగురు పాల్గొన్నారు. ప్రధాన కూరగాయల మార్కెట్‌ను రూ.14,55,500కు గోపీనాథరావు దక్కించుకున్నారు. స్లాటర్ హౌస్‌ను శేషాద్రి నాయుడు రూ.47వేలకు, ప్రైవేటు బస్టాండ్‌ను శేషాద్రి నాయుడు రూ.1.43 లక్షలకు దక్కించుకున్నారు. వేలం పాటలో దక్కించుకున్న వారు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు మాత్రమే గేటు ఫీజు వసూలు చేసుకోవాలని శుక్రవారం అధికారులు పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చిత్తూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి చిత్తూరు జిల్లా, చిత్తూరు, కట్టమంచి, గాండ్లవీధి, డో.నెం. 1-33/1లో కాపురముండు పి.సంగీత, భర్త పి.రుక్మాంగద నాయుడు గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని పి.రుక్మాంగధ నాయుడు గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఇష్యులు, దావాలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 5 దినము లలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : మనలో 4వ నప్పరైన పి. సంగీత భాగమునకు చెందవలసిన ఆస్తి వివరము - 1వ అయిటం : చిత్తూరు డిస్ట్రిక్టు, చిత్తూరు సబ్-డిస్ట్రిక్టు, చిత్తూరు మండలం, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధికు చేరిన నెం. 76 కట్టమంచి గ్రామం లెక్కదాఖలా గ్రామకంఠం సర్వే నెంబరు 60 గల భూమిలో చిత్తూరు టౌన్, కట్టమంచి గాండ్ల వీధిలో మునిసిపల్ డోర్ నెంబరు 1-33 మరియు 1-34 Assessment No. 1008000148 గాగల RCC మిద్దె ఇల్లు, జాగాకు చెక్కుబంది, కొలతల వివరములు : తూర్పు : కె.ఆర్.పయణి గారి ఇల్లు, పడమర : సుబ్రమణ్యం శెట్టి గారి ఇల్లు ఉత్తరం : జయరామ శెట్టి, సాంబయ్య శెట్టి వీరి ఇండ్లు దక్షిణం : కట్టమంచి-పొన్ని రోడ్డు. దీమధ్య తూర్పు-పడమర : 40 అడుగులు లేక 12.19 మీటర్లు, ఉత్తర-దక్షిణం : 80 అడుగులు లేక 24.80 మీటర్లు, ఈ కొలతలు గల 3200 చదరపు అడుగులు లేక 355.55 చదరపు గజములు గల జాగా పూరా. ఈ జాగాలో తూర్పు పడమర 37 అడుగులు, ఉత్తర దక్షిణం 60 అడుగులు ఈ కొలతలు గల 2220 చదరపు అడుగుల విస్తీర్ణములో నిర్మించియుండు Ground floor RCC మిద్దె ఇల్లు పూరా. యిందుకు పైభాగమున తూర్పు పడమర 37 అడుగులు, ఉత్తర దక్షిణం 40 అడుగులు ఈ కొలతలు గల 1480 చదరపు అడుగుల విస్తీర్ణములో నిర్మించియుండు First floor RCC మిద్దె ఇల్లు పూరా. ఈ ఇంట్లకు అమర్చియుండు తలుపులు, ద్వారబంధనములు, కిటికీలు, అల్మెరాలు, అడుగునేల పైకప్పు, కరెంటు సర్వీసు కనెక్షన్ నెంబరు 366, యిందుకు చేరిన డిపాజిట్లు, నాలుగు దిశల గోడలు, మిద్దె పటికట్లు, కాంపౌండు వాలు వగైరాలు పూరా? కె.ఆర్.పయణి భాగం ఇంటిలో యుండు బావి సీళ్లు, మునిసిపల్ కొళాయి సీళ్లు, సెరటిదారిగుండా వచ్చి తీసుకొనిపోవు దారి హక్కున్ను సహా.

ఎ.ఆనందకుమార్, అడ్వకేట్, తిరుపతి, సెల్ : 9866509592

యాదమరిలో జల్లులు



యాదమరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోనూ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులతో కూడిన వర్షంతో వాతావరణం చల్లబడింది. మండల కేంద్రానికి వచ్చిన జనం కొంత ఇబ్బంది పడ్డారు.

నగరంలో మోస్తరు వర్షం

- ఇబ్బందిపడ్డ విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు





చిత్తూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంతోపాటు సమీప మండలాల్లో శుక్రవారం ఉదయం ఐదు నుంచి 11.30 గంటల వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దాంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. వర్షపు నీరంతా పల్లపు ప్రాంతాలైన పొన్నియమ్మన్ గుడివీధి, గురునాథ థియేటర్‌వీధితోపాటు రిక్షాకాలనీ, వీరభద్రకాలనీల్లోకి చేరింది. సంతపేట ఇందిరానగర్ పైభాగంలో కురిసిన వర్షానికి కాల్వలు పొంగి మురుగు రోడ్లపై పారింది. దీంతో దుర్గంధం భరించలేక వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారులు వ్యాపారాల్లేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే పండ్ల మార్కెట్, పాత బస్టాండ్ జనంలేక వెలవెలబోయాయి. మధ్యాహ్నం 12 గంటలకు ఉన్నట్టుండి ఎండ రావడంతో జనం కొంత ఊపిరి పీల్చుకోగా.. సాయంత్రం తిరిగి ఆకాశం మేఘావృతమైంది.

నిండిన చెరువులు



బొమ్మవారిపల్లె వద్ద వంకలో నీటి ప్రవాహం



తూగుండ్రం హాస్టల్‌కు సమీపంలో మొరవ పారుతున్న చెరువు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 11 గంటలవరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో గంగాధరనెల్లూరు - తూగుండ్రం రహదారి ఆవలకొండ ఐజెడ్ఎం స్కూల్, కండ్రిగ దళితవాడకు సమీపంలో తారు రోడ్డుపై వర్షపునీరు ఏరులా ప్రవహించింది. ఈ రోడ్డుపై వెళ్లే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తూగుండ్రంలోని హాస్టల్‌కు సమీపంలో చెరువు మొరవ పారింది. ఆ ఉధృతికి మొరవ డ్యామ్ సైతం దెబ్బతినింది. కలిజవేడు పంచాయతీ బొమ్మవారిపల్లె వద్ద ఉన్న వంక సాగి పెద్దచెరువులోకి నీటి ప్రవాహం చేరింది.

నూరు ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువుల్లో ఏడు నిండాయి: మండలంలో నూరు ఎకరాల విస్తీర్ణం కలిగిన మొత్తం 10 చెరువులు ఉండగా, వీటిల్లో ఏడు పూర్తిస్థాయిలో నిండాయని ఇరిగేషన్ శాఖ డీఈ జయచంద్రబాబు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఈ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మిగిలిన మూడు చెరువులు 60శాతం నీరు ఉందన్నారు. ఇరిగేషన్ పరిధిలోని మిగిలిన 102 చెరువుల్లోనూ దాదాపు 50శాతం నీరు చేరాయన్నారు. తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ వద్ద చెరువుకాల్వ గతంలో తెగిపోయిందని, దీన్ని మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

రోడ్డుపై కూలిన చింత చెట్టు

- తప్పిన పెను ప్రమాదం



తవణంపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దిగువతడకర వద్ద గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి చిత్తూరు-అరగొండ రహదారిపై భారీ చింతచెట్టు ఒకటి రోడ్డుపై కూలింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో శుక్రవారం ఉదయం నుంచే మండల వ్యాప్తంగా జడివాన కురుస్తుండటంతో జనసంచారం తక్కువగా ఉంది. చెట్టుకూలే సమయానికి ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తవణంపల్లె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, గ్రామస్తుల సహకారంతో చెట్టును తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

పారుతున్న కలుజులు

పాలసముద్రం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా మండలంలో వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. భూగర్భ జలాల మట్టం గణనీయంగా పెరిగింది. పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



పుల్లూరు వాగులో నీటి ప్రవాహం

శ్రీరంగరాజపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలో ఎగువకమ్మకండ్రిగలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పుల్లూరు పెద్ద చెరువు వాగులో నీరు ఉధ్రుతంగా ప్రవహిస్తోంది. వాగు వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాధం పిళ్లై హెచ్చరించారు.

ప్రతి ఇంటి వద్ద ఓ మొక్కను నాటాలి

ఐరాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి వద్ద ఓ మొక్కను నాటాలని ఎస్వీ వ్యవసాయ శాఖ అగ్రోనమి ప్రొఫెసర్ రెడ్డిరాము, అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్య అన్నారు. శుక్రవారం 35యర్లంపల్లెలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటారు.

పదవీ విరమణ సన్మానం



వెదురుకుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం పాదిరికుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు దామోదరాన్ని శుక్రవారం సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్ఎం సుప్రసన్న, గురుమూర్తి, జ్యోతి, ఢిల్లీబాబు, ఎల్లయ్య, పుష్పలత, మునికృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై వైసీపీ ర్యాలీ, వినతి



వెదురుకుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడుపై శుక్రవారం కార్వేటినగరంలో వైసీపీ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించారు. జీడీనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ ప్రముఖులు విద్యుత్ శాఖ ఏడీఏ కార్యాలయం వరకు ర్యాలీ వచ్చారు. ఏడీఏ చంద్రబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్వేటినగరం ఎంపీపీ లత, వెదురుకుప్పం జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బట్టే సుబ్రహ్మణ్యం, మురళీరాయల్, సర్పంచ్ ధనంజయ వర్మ, వెదురుకుప్పం మండల పార్టీ అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి, సింగం హేమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, గాండ్లమిట్ట కూడలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి వైసీపీ నేతలు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు

పూతలపట్టు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి పోలీసులు, పంచాయతీ అధికారులు దహన సంస్కారాలు నిర్వహించారు. కుప్పయ్య (76) పి.కొత్తకోట సమీపాన ఉన్న గ్రామాల్లో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించేవాడు. అనాథ కావడంతో కొత్తకోట వద్ద ఉన్న ఫ్లైఓవర్ కింద నివాసం ఉండేవాడు. రెండ్రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఈయన గురువారం రాత్రి మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కృష్ణమోహన్ శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని పంచాయతీ అధికారులతో కలిసి దహన సంస్కారాలు చేశారు.

వృద్ధులకు అన్నదానం

వెదురుకుప్పం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం గొల్లకండ్రిగకు చెందిన భారతి వితరణతో వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు, రొట్టెలను కూడా అందించారు.

విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి: వైసీపీ



చిత్తూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని కడప ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చి ఆరు నెలల తిరగకముందే చార్జీల భారం మోపుతున్నారని విమర్శించారు. కట్టమంచిలోని వివేకానంద విగ్రహం నుంచి గాంధీ రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయం వరకు వైసీపీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈఈ మునిచంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు త్వరగా పూర్తి చేయండి

పాలసముద్రం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని క్లస్టర్ ఏపీడీ సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం ఆముదాల,వెంగళరాజుకుప్పం, పాలసముద్రం, శ్రీకావేరి రాజుపురం పంచాయతీల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్లను పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. ఏపీవో మార్గరేట్, ఈసీ అనూష, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా చేసుకోండి



సదస్సులో ప్రసంగిస్తున్న మధుసూదనరెడ్డి

పెనుమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు బీమా చేసుకోవాలని రైతులకు జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సీఎస్ అగ్రహారం వద్ద ఉన్న మ్యాంగో భవన్‌లో పులిగుంటేశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మామిడి, ఇతర ఉద్యాన పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి రైతులు ఎకరాకు రూ.1750 చెల్లించి బీమా చేసుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. అనంతరం సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రంజిత్‌కుమార్, రైతు సంఘం అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి, సీఈవో చందన, జగన్నాథరెడ్డి, జ్ఞానశేఖర్, సంధ్య, రఘు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో చిన్నారి ప్రతిభ



ట్రోఫీలతో సమీర

బంగారుపాళ్యం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్ (యూసిమాస్) అబాకస్ పోటీల్లో బంగారుపాళ్యంకు చెందిన సమీర బీ కేటగిరీలో రెండోస్థానం సాధించింది. చిత్తూరులోని బీబీరెడ్డి కాన్వెంట్‌లో మూడో తరగతి చదువుతున్న ఈ చిన్నారిని శుక్రవారం జడ్పీ మాజీ చైర్మన్ ఎంబీ కుమార్ రాజా, వాలీబాల్ క్రీడాకారుడు మురారి, సర్పంచ్ ఉమాదేవి, వైస్ సర్పంచ్ కామరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నగరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌కండ్రిగ వద్ద ఉన్న దేశమ్మ ఆలయంలో 2025వ సంవత్సరం క్యాలెండర్లను శుక్రవారం టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు ఆవిష్కరించారు. దాతలు ఆనందరెడ్డి, శంకర్, హరి, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు, దూర్వాసులునాయుడు, మదన్‌కుమార్, వెంకటాచలం, సుబ్బయ్య, రజనీకుమార్, అశోక్, మోహనకృష్ణ, నీలకంఠం, చెంచయ్య, భక్తులు పాల్గొన్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై డీఈవో సమీక్ష

నగరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై నగరి, నిండ్ర, విజయపురం, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో నగరిలో శుక్రవారం డీఈవో వరలక్ష్మి సమీక్షించారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని చెప్పారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈవో వరలక్ష్మి

మా భూములను ఆన్‌లైన్ చేయండి / అధికారులకు రైతుల మొర



విజయపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న తహసీల్దార్

విజయపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం డీకేటీ భూములు పంపిణీ చేసి 20 ఏళ్లయినా ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని విజయపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు తహసీల్దార్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. డీటీ అశోక్, సర్వేయర్ శేఖర్, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ ఉమ్మడి అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని రామలింగాపురంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను తహసీల్దార్ అరుణకుమారి స్వీకరించారు. ఈ సదస్సులో ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్, వీఆర్వోలు శివయ్య, శ్రీను, పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు, మోపిరెడ్డిపల్లె సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 92 అర్జీలు అందాయని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. మ్యుటేషన్‌కు 61, రీసర్వేకు 25, ఇతర సమస్యలపై 6 వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, పార్లమెంటు కార్యదర్శి తలారిరెడ్డెప్ప, వీఆర్‌వో శ్యాం, సర్వేయర్ శశికిరణ్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడిగా షణ్ముగం



చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడిగా షణ్ముగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నగరంలో నాయకులు, సభ్యులు చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వివరించారు.

విజయపురం అధ్యక్షుడిగా రాము



విజయపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండల బీజేపీ అధ్యక్షుడిగా రామును ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలకం ఈశ్వర్‌ప్రసాద్ తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

పెనుమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలవగుంట పంచాయతీలో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శి దృష్టి సారించాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డితో కలిసి సచివాలయం, అంగన్వాడీ, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగులోని జీతాలివ్వాలి

నగరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వంటకార్మికులు, ఆయాలకు పెండింగులోని జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరికి విచ్చేసిన డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని డీఈవో హామీ ఇచ్చారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తగ్గువారిపల్లె గ్రామదేవత దండుమారెమ్మ ఆలయంలో ఓంశక్తి మాల ధరించిన భక్తులు శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఉపసర్పంచ్ లోకనాథనాయుడు, కోటీశ్వరమ్మ, కవిత,రూప, విజయరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెజ్జుపల్లె గ్రామంలోని స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి, సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, శైలా, ఏఎన్ఎం ఈశ్వరి, మాలతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

గుడిపాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుమ్మలవారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత కర్రెబ్బ నాయుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.